9

సాక్షి అనకాపల్లి

గురువారం | 6 | మార్చి | 2025

మగువా.. చూపు తెగువ

మహిళా దినోత్సవంలో భాగంగా ఆంధ్ర విశ్వవిద్యాలయం దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ సెంటర్ ఫర్ ఉమెన్ స్టడీస్, ఏయూ యునైటెడ్ సంయుక్తంగా విద్యార్థుల కోసం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. ఇందులో భాగంగా ఏయూ బాస్కెట్ బాల్ మైదానంలో బుధవారం జరిగిన ఫ్లాష్ మాబ్ ఉత్సాహభరితంగా సాగింది. ఈ కార్యక్రమంలో వర్సిటీకి చెందిన విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మహిళా సాధికారత, లింగ సమానత్వాన్ని చాటి చెప్పే పాటలకు విద్యార్థులు నృత్యాలు చేస్తూ అందరినీ అలరించారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో ఉత్సాహాన్ని నింపడమే కాకుండా, సమాజంలో మహిళల పాత్రపై అవగాహన పెంచుతాయని వర్సిటీ ప్రతినిధులు పేర్కొన్నారు. - ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం


అలరించిన ఫ్లాష్ మాబ్

రంజాన్ వేళలు

	ఇఫ్తార్	సహర్
	గురు	శుక్ర
అనకాపల్లి	6.09	4.57
నర్సీపట్నం	6.12	4.54

న్యూస్‌రీల్

దిమిలి మాజీ సర్పంచ్ నగిరెడ్డి ప్రభాకరరావు మృతి



రాంబిల్లి (యలమంచిలి): దిమిలి మాజీ సర్పంచ్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు నగిరెడ్డి ప్రభాకరరావు (83) మంగళవారం రాత్రి మృతి చెందారు. ఆయన మేజర్ పంచాయతీ దిమిలి సర్పంచ్‌గా నాలుగుసార్లు ఎన్నికయ్యారు. గతంలో యలమంచిలి నుంచి కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా కూడా పోటీ చేశారు. డీసీసీ ఉపాధ్యక్షుడిగా పనిచేశారు. ప్రస్తుతం ఆయన వైఎస్సార్‌సీపీలో కొనసాగుతున్నారు. ప్రభాకరరావు మృతికి పార్టీకి అతీతంగా పలువురు నేతలు, జిల్లా కళాకారుల సమాఖ్య నాయకులు ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు.

గోవాడ సుగర్స్‌లో మళ్లీ క్రషింగ్‌కు అంతరాయం

చోడవరం: టర్బైన్‌లో బేకర్ సమస్య తలెత్తడంతో బుధవారం గోవాడ సుగర్స్‌లో క్రషింగ్‌కు మళ్లీ అంతరాయం కలిగింది. బెగాస్ కొరత, బాయిలర్ హౌస్‌లో సమస్యలతో ఇప్పటికే పలుమార్లు క్రషింగ్‌కు అంతరాయం కలిగింది. దీంతో సహనం కోల్పోయిన చెరకు రైతులు వారం రోజుల కిందట భారీ ఆందోళన కూడా చేశారు. యాజమాన్యం చర్యలు తీసుకొని అంతా సజావుగా నడుస్తుందనుకుంటున్న సమయంలో మళ్లీ ఇప్పుడు బేకర్ సమస్య తలెత్తింది. దీనికి మరమ్మతులు చేయడానికి స్థానికంగా ఎవరూ మెకానిక్ ఇంజినీర్లు లేకపోవడంతో మద్రాసు నుంచి హుటాహుటిన రప్పించారు. ప్రస్తుతం వారు బేకర్‌ను బాగుచేస్తున్నారు. గురువారం క్రషింగ్ తిరిగి ప్రారంభమవుతుందని భావిస్తున్నారు. క్రషింగ్ నిలిచిపోవడంతో యథావిధిగా ఫ్యాక్టరీ యార్డుల వద్ద, చెరకు కాటాల వద్ద పెద్ద సంఖ్యలో చెరకు లోడుతో వాహనాలు నిలిచిపోయాయి.

గీత కులాల మద్యం షాపులకు నేడు లాటరీ

తుమ్మపాల: ఈ నెల 6న సాయంత్రం 4 గంటలకు ఎస్‌ఆర్ శంకరన్ మీటింగ్ హాలులో గీత కులాలకు కేటాయించిన మద్యం షాపులకు లాటరీ నిర్వహించనున్నట్లు జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి వి.సుధీర్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో గీత కులాలకు కేటాయించిన 15 మద్యం షాపులకు గాను 205 దరఖాస్తులు వచ్చాయన్నారు.

విశాఖ చేరుకున్న కేంద్ర ఆర్థిక మంత్రి



గోపాలపట్నం: కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ఢిల్లీ నుంచి బుధవారం రాత్రి విశాఖ ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారు. ఆమెకు రాష్ట్ర మంత్రులు అనిత, పయ్యావుల కేశవ్, ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు, బీజేపీ మహిళా నాయకులు ఘన స్వాగతం పలికారు. ఎయిర్‌పోర్టు నుంచి రోడ్డు మార్గంలో నోవాటెల్ హోటల్‌కి చేరుకున్నారు. గురువారం గీతంలో జరిగే పుస్తక ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొంటారు.
మధ్యాహ్నం బడ్జెట్ అంశంపై నోవాటెల్ హోటల్‌లో నిర్వహించే సదస్సులో అధికారులు, పారిశ్రామికవేత్తలు, నిపుణులతో భేటీ అవుతారు. అనంతరం అక్కడ మీడియాతో మాట్లాడతారు.



కూటమి పాలనలో ఆశ.. నిరాశ

వేతనాల పెంపుపై మాట తప్పిన ప్రభుత్వం ▪ అనేక సమస్యలకు దొరకని పరిష్కారం

- బడ్జెట్‌లో ప్రకటించిన మూడు అంశాలూ కంటితుడుపునకే..
- మండిపడుతున్న ఆశా కార్యకర్తలు
- డిమాండ్ల సాధనకు నేడు ‘చలో విజయవాడ’

సాక్షి, అనకాపల్లి: తీవ్రమైన పని ఒత్తిడి.. చాలీచాలని జీతాలు.. పెరిగిన నిత్యావసర ధరలు.. దీంతో బతుకు భారమై భవిష్యత్తు అగమ్యగోచరమై ఆశా కార్యకర్తలు ఉద్యమిస్తున్నారు. కరోనా లాంటి విపత్కర సమయాల్లో కూడా ప్రాణాలను పణంగా పెట్టి పనిచేశామని, తమకు ఉద్యోగ భద్రత కల్పించాలన్న కనీస డిమాండ్‌కూ ఈ కూటమి ప్రభుత్వం మొండిచేయి చూపించిందని వారు మండిపడుతున్నారు. అందుకే ఈ నెల 6వ తేదీన తలపెట్టిన ‘చలో విజయవాడ’కు బయల్దేరారు. జిల్లాలోని వైద్యాధికారులందరికీ వినతిపత్రాలు సమర్పించి, ఫలితం లేకపోవడంతో చివరకు ఉద్యమించడానికి సిద్ధపడ్డారు. ఆశ వర్కర్లకు ఉద్యోగ విరమణ ప్రయోజనాలేవీ అందడం లేదని, తక్షణమే వాటిని అమలుచేయాలని, వేతనాలు పెంచాలని వారు ప్రధానంగా డిమాండ్ చేస్తున్నారు. ఆశా వర్కర్స్ యూనియన్‌కు ఇచ్చిన హామీలను గాలికి వదిలేసి కూటమి ప్రభుత్వం ఈ బడ్జెట్‌లో ప్రసూతి సెలవులు, 30 ఏళ్ల సర్వీసు ఉన్నవారికి ఉద్యోగ విరమణ ప్రోత్సాహంతో సరిపెట్టింది. తమకు ఉద్యోగ భద్రత కల్పించి.. కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్‌ని ఆశావర్కర్లుగా మార్పు చేయాలని, ప్రభుత్వ సెలవులు, క్యాజువల్ లీవ్స్, బీమా సౌకర్యం, మట్టి ఖర్చులు ఇవ్వాలని వారు కోరుతున్నారు. ఏఎన్‌ఎం కోర్సు పూర్తి చేసిన వారికి పదోన్నతి కల్పించాలన్న కనీసమైన డిమాండ్‌నూ ప్రభుత్వం పట్టించుకోలేదు. వీటిపై ఆశా వర్కర్స్ యూనియన్‌తో ప్రభుత్వం కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం వాటిని అమలు చేయాలని ఏపీ ఆశా వర్కర్ల యూనియన్ వైద్య ఆరోగ్యశాఖ కార్యదర్శికి విజ్ఞప్తి చేసింది. 2024 ఫిబ్రవరి 9వ తేదీన ఇచ్చిన ఒప్పంద మినిట్స్ కాపీలకు జీవోలు ఇచ్చి అమలు చేయాలని కోరుతూ గురువారం చలో విజయవాడకు పిలుపునిచ్చారు. జిల్లాలో 1445 మంది ఆశాలు తమ నిరసన తెలియజేయడానికి విజయవాడకు పయనమయ్యారు.


వైద్యాధికారులకు వినతి పత్రం సమర్పిస్తున్న ఆశా కార్యకర్తలు (ఫైల్)

బడ్జెట్‌లో యూజ్‌లెస్ హామీలు



బడ్జెట్‌లో మూడు వరాలు ఇచ్చినట్టు రాష్ట్ర ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటోంది. అందులో ఏదీ మాకు ఉపయోగపడేది లేదు. రిటైర్ అయిన వారికి రూ.1.5 లక్షల గ్రాట్యుటీ ఇస్తామని చెప్పారు. దేశంలో ఆశా వ్యవస్థ ఏర్పాటు చేసి 20 ఏళ్లయింది. మన రాష్ట్రంలో ఏ కార్యకర్తకు 15 ఏళ్లు మించి అనుభవం లేదు. మరి 30 ఏళ్ల సర్వీసు ఉంటే గ్రాట్యుటీ ఇస్తామన్న హామీతో ఎవరికి ఉపయోగం? 180 రోజుల ప్రసూతి సెలవులు ప్రకటించారు. జిల్లాలో ఉన్న ఆశా కార్యకర్తల్లో 99 శాతం మంది 40 ఏళ్లు దాటినవారే. ఉద్యోగ విరమణ వయసు 62 ఏళ్లకు పెంపు కూడా మాకు పనికి వచ్చేది కాదు. పని ఒత్తిడితో 60 ఏళ్లకే అనారోగ్యం బారిన పడుతున్నాం. ఎన్నికల హామీలు నెరవేర్చలేదని నిరసన తెలుపుతున్నామని కూటమి ప్రభుత్వం యూజ్ లెస్ హామీలు ఇచ్చింది. అందుకే తీవ్ర స్థాయిలో ఉద్యమిస్తున్నాం.

–ఈశరపు పార్వతి, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి

హామీలే తప్ప జీవోలు లేవు

మాకు ఇచ్చే జీతం కన్నా ఎక్కువగా పనిచేస్తున్నాం. యాప్‌ల **పేరిట ఉదయం నుంచి** రాత్రి వరకూ పని ఒత్తిడి పెంచేస్తున్నారు. **కూటమి ప్రభుత్వం అధి**కారంలోకి వచ్చి 9 నెలలైంది. మా ఒప్పంద **మినిట్స్ బుక్‌లో హామీల**ను అమలు చేస్తూ జీవోలు లేవు. మా కష్టానికి **తగిన ప్రతిఫలం లేదు.** పెరుగుతున్న నిత్యావసర ధరల కారణంగా వచ్చే **జీతంతో కుటుంబాలు గడవ**డం లేదు. ఈ బడ్జెట్‌లో మా హామీలు నెరవేరుస్తా**రనుకుంటే తెలివిగా అక్కరకు** రాని ప్రకటనలు చేశారు. ఏదో అరకొరగా పనికి **రాని హామీలు మూడు ఇ**చ్చారు. ఇది మమ్మల్ని వెక్కి**రించినట్టుగా ఉంది. అందుకే** విజయవాడకు పయనమ**య్యాం. ఇప్పటికైనా ప్ర**భుత్వం కనీస వేతనాలు **పెంచాలి. లేదంటే మ**రింత ఉద్యమిస్తాం.

– కాకర శాంతి, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి



ఆదుకున్నది గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే..

వాస్తవానికి వేతనాలు పెంచి ఆశా కార్యకర్తలను ఆదుకున్నది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే. 2019కి ముందు వరకు చాలీచాలని వేతనాలతో ఆశాలు అగచాట్లు పడుతున్నా చంద్రబాబు ప్రభుత్వం పట్టించుకోలేదు. కనీసం వారి కష్టాలను విన్నది కూడా లేదు. ఈ నేపథ్యంలో తమ వేతనాలు పెంచి ఆదుకోవాలని పాదయాత్రలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆశా సిబ్బంది కోరారు. ఆయన సీఎం అయ్యాక 2019 ఆగస్టులో వారి వేతనాలను రూ.5 వేల నుంచి ఒకేసారి రూ. 10 వేలకు పెంచారు. వేతనం పెంచి ఐదేళ్లయిందని, పెరిగిన జీవన వ్యయాలు, కుటుంబ అవసరాలకు అనుగుణంగా మళ్లీ పెంచాలని గత ఏడాది డిసెంబరులో రాష్ట్రవ్యాప్తంగా ఆశా సిబ్బంది ధర్నాకు దిగారు. మరోపక్క కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక స్థానిక నాయకులు వీరిపై దాడులు మొదలుపెట్టారు. గ్రామాల్లో పనిచేస్తున్న ఆశాలను రాజకీయ కారణాలతో తొలగించి, వారి పొట్టగొట్టే పన్నాగానికి తెర తీశారు.

అంగన్‌వాడీ కార్యకర్త ఆత్మహత్యాయత్నం

సీడీపీవో, సూపర్‌వైజర్ వేధింపులే కారణమని ఆరోపణ

కె.కోటపాడు: పోతనవలస అంగన్‌వాడీ కార్యకర్త రొంగలి నూకరత్నం బుధవారం చీమలమందు తాగి ఆత్మహత్యకు యత్నించారు. పొలానికి వెళ్లిన భర్త నాయుడు ఇంటికి తిరిగి వచ్చే సరికి ఆమె అపస్మారక స్థితిలో ఉన్నారు. పక్కనే సీటిలో చీమల మందు కలిపి ఉన్న గ్లాస్ ఉండడంతో ఆయన చూసి ఆందోళన చెందాడు. దీంతో భార్యను ఆటోలో కె.కోటపాడు సీహెచ్‌సీకి తరలించారు. అవసరమైన వైద్యం అందించామని, ప్రస్తుతం ఆమె ఆరోగ్యం బాగానే ఉందని సీహెచ్‌సీ వైద్యాధికారి ప్రశాంత్ తెలిపారు.

శ్రుతి మించిన వేధింపులు

కె.కోటపాడు సీడీపీవో మంగతాయారు, సూపర్‌వైజర్లు రాములమ్మ, కల్యాణి తిట్టడం వల్లనే మనస్తాపం చెంది ఆత్మహత్యకు యత్నించినట్టు అంగన్‌వాడీ కార్యకర్త నూకరత్నం తెలిపారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆమె సాక్షితో మాట్లాడుతూ.. ఈ నెల 1న అంగన్‌వాడీ కేంద్రం విజిట్‌కు వచ్చిన సీడీపీవో మంగతాయారు, సూపర్‌వైజర్ రాములమ్మలు తనను తిట్టి, సెంటర్ రికార్డులు కె.కోటపాడు ఆఫీస్‌కు తీసుకువెళ్లిపోయారని తెలిపారు. ఆ రోజు మధ్యాహ్నం సీడీపీవో కార్యాలయానికి రావాలని తెలిపితే వెళ్లానని, అక్కడ కూడా వారు తీవ్ర దుర్భాషలాడారని ఆమె పేర్కొన్నారు. 3న పోతనవలస గ్రామంలో సూపర్‌వైజర్ తనిఖీ చేశారని, అంగన్‌వాడీ కేంద్రం ద్వారా పాలు, గుడ్లు, సరకులు సక్రమంగా ఇస్తున్నట్లు లబ్ధిదారులు తెలిపినా.. సీడీపీవో మంగతాయారు గ్రామ సమావేశంలో అందరి ముందు తనని చెప్పలేని పదజాలంతో తీవ్రంగా దుర్భాషలాడారని నూకరత్నం తెలిపారు. దీంతో మనస్తాపానికి గురై ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డానని నూకరత్నం తెలిపారు.


కె.కోటపాడు సీహెచ్‌సీలో నూకరత్నంను పరామర్శిస్తున్న సీపీఎం నాయకులు

బాధితురాలికి సీపీఎం నాయకుల పరామర్శ

కె.కోటపాడు సీహెచ్‌సీలో నూకరత్నంను సీపీఎం నాయకులు పరామర్శించారు. పార్టీ మండల కార్యదర్శి రొంగలి ముత్యాలనాయుడు మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్త నూకరత్నంకు ఎటువంటి ప్రమాదం జరిగినా సీడీపీవో, సూపర్‌వైజర్లు బాధ్యత వహించాల్సి ఉంటుందని అన్నారు. ఉద్యోగపరంగా తప్పులుంటే సంజాయిషీ అడగాలి లేదా శాఖాపరంగా పనిష్మెంట్ ఇవ్వాలి తప్ప వ్యక్తిగతంగా దూషించే హక్కు ఎంత పెద్ద అధికారికీ లేదని ముత్యాలనాయుడు అన్నారు.

పోలీస్ స్టేషన్లకు నూతన భవనాలు

త్వరలో ప్రారంభం ● ఎస్పీ తుహిన్ సిన్హా


గొలుగొండ/నాతవరం: నూతనంగా నిర్మించిన పోలీస్ స్టేషన్ భవనాలను త్వరలో ప్రారంభిస్తామని ఎస్పీ తుహిన్ సిన్హా తెలిపారు. ఆయన బుధవారం గొలుగొండ, కృష్ణదేవిపేట, నాతవరం పోలీస్ స్టేషన్లను సందర్శించారు. కొత్త భవనాలను పరిశీలించారు. రికార్డులు తనిఖీ చేశారు. అనంతరం మాట్లాడుతూ గంజాయి రవాణా జరగకుండా నిత్యం గస్తీ నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశారు. ప్రజలతో పోలీసులు స్నేహభావంతో మెలగాలని తెలిపారు. రహదారి భద్రత, సైబర్ నేరాలపై ప్రజలకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పించాలని ఆదేశాలు జారీ చేశారు. కృష్ణదేవిపేట పోలీస్ స్టేషన్‌కు కొత్త వాహనం మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. నాతవరం స్టేషన్‌లో ఉన్న వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను పరిశీలించి వీటి కేసులను ట్యాగ్ చేయాలని ఎస్‌ఐను ఆదేశించారు. స్టేషన్ సిబ్బందితో మాట్లాడి వారి సమస్యలను అడిగి పలు సూచనలు చేశారు. జిల్లాలో నక్కపల్లితో పాటు పలు మండలాల్లో నూతన భవనాల నిర్మాణానికి ప్రతిపాదనలు చేశామన్నారు. జిల్లాలో కొత్తకోట పోలీసు స్టేషన్ పరిధిలో తరుచు గంజాయి రవాణా చేస్తూ పట్టుబడుతున్నారని, పీడీ యాక్టు ప్రకారం వారి ఆస్తులు జప్తు చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. అసెంబ్లీ సమావేశాల అనంతరం హోం మంత్రి దృష్టికి తీసుకువెళ్లి అమలు చేస్తామన్నారు. డీఎస్పీ శ్రీనివాసరావు, కృష్ణదేవిపేట, గొలుగొండ, నాతవరం ఎస్‌ఐలు తారకేశ్వరావు, రామారావు, సీహెచ్ భీమరాజు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.


రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ తుహిన్ సిన్హా

టెన్త్ పరీక్షల్లో విద్యార్థుల హక్కులకు ప్రాధాన్యమివ్వాలి

రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం

అనకాపల్లి: రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల 17 నుంచి జరగనున్న పదో తరగతి వార్షిక పరీక్షలకు విద్యార్థుల హక్కులతో ముడిపడి ఉన్న సంక్షేమానికి జిల్లా అధికారులు ప్రాధాన్యం ఇవ్వాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం అన్నారు. స్థానిక జీవీఎంసీ వేల్పులవీధి బాలికోన్నత పాఠశాల ఆవరణలో బుధవారం విద్యాశాఖ, సర్వశిక్షా అభియాన్, కేజీబీవీ పాఠశాలల ఉపాధ్యాయులతో సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బాలల హక్కుల పరిరక్షణలో భాగంగా తాగునీటి సదుపాయం, చక్కని గాలి, వెలుతురు, పరిశుభ్రమైన మరుగుదొడ్లు, ఫ్యాన్లు, సరిపడినన్ని బెంచీలు, కుర్చీలు ఏర్పాటు చేయాలన్నారు. పరీక్షలు జరిగే కేంద్రాల పరిధిలో విద్యుత్ సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలని, మారుమూల గ్రామాల విద్యార్థులకు పరీక్షలకు హాజరవడానికి రవాణా ఇబ్బందులు లేకుండా సరిపడా బస్‌లు ఏర్పాటు చేయాలని, పరీక్ష కేంద్రంలో వైద్య సదుపాయాలు కల్పించాలని సూచించారు. జిల్లా ఉప విద్యాశాఖ అధికారి పి.అప్పారావు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నుంచి 20,774 మంది విద్యార్థినీ విద్యార్థులు 107 పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు రాయనున్నట్టు తెలిపారు.


సమావేశంలో మాట్లాడుతున్న గొండు సీతారాం

క్షణికావేశంలో..

- ప్రేమ జంట ఆత్మహత్యాయత్నం
- యువతి మృతి
- ఆస్పత్రిలో ప్రాణాపాయ స్థితిలో ప్రియుడు




మృతి చెందిన యువతి నూకమ్మ(ఫైల్), లక్ష్మణ్

అచ్యుతాపురం రూరల్: క్షణికావేశంలో తీసుకున్న నిర్ణయాల వల్ల ఎన్నో కుటుంబాలు రోడ్డున పడిపోతున్నాయి. అటువంటి ఉదంతమే మండలంలోని పూడిమడకలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పూడిమడక గ్రామానికి చెందిన లక్ష్మణ్ (26) అనే వివాహితుడు అదే గ్రామానికి చెందిన మరో యువతిని ప్రేమించి వివాహం చేసుకుందామనుకున్నాడు. అయితే అప్పటికే వివాహితుడైన లక్ష్మణ్ కుటుంబం దీనికి అడ్డుచెప్పడంతో తన ప్రియురాలు నూకమ్మ (20)తో కలిసి అచ్యుతాపురంలోని ఒక ప్రైవేట్ ప్రాంతంలో విషం తాగారు. ఆ యువతి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందగా లక్ష్మణ్ ప్రాణాపాయ స్థితిలో విశాఖ కేజీహెచ్‌లో కొట్టుమిట్టాడుతున్నాడు. లక్ష్మణ్‌కి భార్య, ఏడాదిన్నర వయసు గల పాప, ఆరు నెలల బాబు ఉన్నారు. లక్ష్మణ్ ఆస్పత్రి పాలవడంతో ఆ కుటుంబం పరిస్థితి దయనీయంగా మారింది. ఘటనపై అందిన ఫిర్యాదు మేరకు అచ్యుతాపురం ఎస్‌ఐ వెంకటరావు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

ఉపమాక కల్యాణోత్సవాలకు కట్టుదిట్టమైన భద్రత

- నాలుగువైపులా చెక్‌పోస్టులు
- ప్రత్యేక పార్కింగ్ ప్రదేశాలు
- అన్ని ప్రాంతాల్లో సీసీ కెమెరాలు
- ఆలయ ప్రాంగణంలో భద్రతా ఏర్పాట్లపై పోలీసు అధికారుల సమీక్ష

నక్కపల్లి: ఉపమాక వేంకటేశ్వరస్వామివారి వార్షిక కల్యాణోత్సవాలకు ఏర్పాట్లు చురుగ్గా జరుగుతున్నాయి. ఈ నెల 10న స్వామివారి కల్యాణం అంగరంగ వైభవంగా జరగనుంది. 9వ తేదీన ఇందుకు అంకురార్పణ చేస్తారు. ఐదు రోజులపాటు స్వామివారి కల్యాణోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు టీటీడీ వారు ఏర్పాట్లు ప్రారంభించారు. కల్యాణోత్సవాల సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకుంటున్నారు. నక్కపల్లి సీఐ కుమారస్వామి, ఎస్‌ఐ సన్నిబాబు, దేవస్థానం మాజీ చైర్మన్లు కొండబాబు, బుజ్జి, మండల టీడీపీ అధ్యక్షుడు కె.వెంకటేష్, ప్రధానార్చకులు జి.వరప్రసాదాచార్యులు బుధవారం దేవస్థానంలో సమావేశమయ్యారు. కల్యాణోత్సవాల సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఏర్పాట్లపై చర్చించారు. నాలుగు చక్రాల వాహనాలను నిర్దేశించిన చోటనే పార్క్ చేయాలి. ద్విచక్రవాహనాలను 10వ తేదీ ఉదయం నుంచి సాయంత్రం వరకు మాత్రమే ఆలయం వద్దకు అనుమతిస్తారు. పదో తేదీ సాయంత్రం నుంచి పదకొండో తేదీ ఉదయం వరకు కేవలం నడచి వెళ్లే భక్తులను మాత్రమే అనుమతిస్తారు. రూ.కోట్లాది విలువైన స్వామివారి ఆభరణాలను విశాఖ ట్రెజరీ నుంచి తీసుకురానుండడంతో పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నట్లు సీఐ కుమారస్వామి తెలిపారు. ఆలయం వద్ద పోలీస్ ఔట్‌పోస్టు, ఆలయానికి చేరుకునే నాలుగు మార్గాల్లో పోలీస్ చెక్‌పోస్టులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. సుమారు 200 మందికి పైగా పోలీసు సిబ్బంది గస్తీ కాస్తారన్నారు.


భద్రతా ఏర్పాట్లపై దేవస్థానం వారితో చర్చిస్తున్న పోలీసు అధికారులు


విశాఖలో హైకోర్టు బెంచ్ కోసం త్వరలో అఖిలపక్ష సమావేశం

విశాఖ లీగల్ : విశాఖలో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలని కోరుతూ త్వరలో ఆరు జిల్లాలకు చెందిన ప్రజా ప్రతినిధులు ఇతర నాయకులతో కలిసి అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు విశాఖ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బెవర సత్యనారాయణ పేర్కొన్నారు. ఈ నెలాఖరు లేదా వచ్చే నెల మొదటి వారంలో అఖిలపక్ష సమావేశం ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నామని తెలిపారు. ఇప్పటికే ఏడు జిల్లాల(శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి, కాకినాడ) న్యాయవాదులతో ఒక సదస్సును ఏర్పాటు చేసి.. మద్దతు కూడగట్టామని పేర్కొన్నారు. భవిష్యత్ కార్యాచరణపై అఖిలపక్ష సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. ప్రజా ప్రతినిధులు, ఇతర నేతల సహకారంతో రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని.. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును కలిసి ఈ ఆరు జిల్లాల ప్రజాభీష్టాన్ని వివరించనున్నట్లు తెలిపారు.

పేదల ఇంటి స్థలాల క్రమబద్ధీకరణ వేగవంతం

రెవెన్యూ అధికారుల సమీక్ష సమావేశంలో కలెక్టర్ విజయ కృష్ణన్

తుమ్మపాల: ప్రభుత్వం పేదలకు కల్పిస్తున్న ఇంటి స్థలాల క్రమబద్ధీకరణ పథకాన్ని అర్హులందరికీ అమలు చేయాలని కలెక్టర్ విజయ కృష్ణన్ అన్నారు. పీజీఆర్‌ఎస్, రీసర్వే, గ్రామసభలు, వెబ్‌ల్యాండ్, ఇళ్ల స్థలాల రీ–వెరిఫికేషన్, ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణ, రికార్డు రూమ్‌ల నిర్వహణ వంటి అంశాలపై బుధవారం కలెక్టరేట్‌లో అన్ని మండలాల రెవెన్యూ అధికారులతో జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవితో కలిసి ఆమె సమీక్షించారు. అభ్యంతరం లేని ప్రభుత్వ భూమిలో 2019 మార్చి 15 నాటికి ఇల్లు కట్టుకుని, ప్రస్తుతం నివాసముంటూ, ఇంటికి సంబంధించిన ఆధార పత్రాలు కలిగి, ఎక్కడా ఇల్లు లేనివారు మాత్రమే ఈ పథకానికి అర్హులని తెలిపారు. 150 గజాలలోపు స్థలంలో ఇల్లు కట్టుకున్న పేదవారికి ఉచితంగా, అంతకంటే ఎక్కువ స్థలం కలిగిన వారికి ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారం రుసుము వసూలు చేసి క్రమబద్ధీకరిస్తామన్నారు. జేసీ ఎం.జాహ్నవి మాట్లాడుతూ రీ–సర్వేపై గ్రామసభల్లో వచ్చిన అర్జీలన్నింటినీ రెండు రోజుల్లో పరిష్కరించాలన్నారు. వెబ్‌ల్యాండులో మార్పుల కోసం ప్రతిపాదనలను సర్వే నంబరు, సబ్ డివిజన్ వివరాలతో పంపించాలన్నారు. చౌకధరల దుకాణాలు, గోడౌన్లు, బియ్యం మిల్లులను తనిఖీ చేసి నిబంధనలు అతిక్రమించిన వారిపై కేసులు నమోదు చేయాలని తెలిపారు. డీఆర్వో వై.సత్యనారాయణరావు, కె.ఎల్.ఆర్.సి. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎస్.వి.ఎస్.సుబ్బలక్ష్మి, బి.జె.ఆర్.యు.ఎస్.ఎస్. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె.రమామణి, ఆర్డీవోలు వి.వి.రమణ, షేక్ ఆయిషా, కలెక్టరేట్ పరిపాలనాధికారి బి.వి.రాణి, సెక్షను సూపరింటెండెంట్లు, సర్వే శాఖ సహాయ సంచాలకులు గోపాలరాజు, తహసీల్దార్లు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయ కృష్ణన్, జేసీ జాహ్నవి

మహిళా దినోత్సవానికి ఘనంగా ఏర్పాట్లు

తుమ్మపాల: అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహణ కోసం, జిల్లా, మండల స్థాయిలో ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ విజయకృష్ణన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ నెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహణకు సంబంధించి బుధవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో సంబంధిత శాఖల జిల్లా అధికారులతో సమీక్షించారు. మండల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని సంబంధిత అధికారులు సమన్వయం చేసుకుని విజయవంతం చేయాలన్నారు. అదేరోజున మహిళల భద్రత కోసం మహిళా శక్తి యాప్‌ను జిల్లా స్థాయిలో స్త్రీలు, పిల్లల విభాగాన్ని ప్రారంభించడం జరుగుతుందన్నారు. జిల్లా, మండల స్థాయిలో కార్యక్రమం జరిగే ప్రదేశాలలో శక్తి యాప్ లోగో ఏర్పాటు చేసి, యాప్‌పై మహిళలకు అవగాహన కల్పించాలని జిల్లా అదనపు ఎస్పీ ఎం.దేవ ప్రసాద్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మహిళలకు ఆరోగ్య పరీక్షలు చేయాలని, పోషకాహార ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి మండలానికి ఒక స్వయం సహాయక బృందం సభ్యులకు సన్మానం చేయాలని, జిల్లా స్థాయిలో వివిధ రంగాల్లో విజయవంతమైన మహిళలను సన్మానించాలని సూచించారు. అదేరోజు బ్యాంకర్లు స్వయం సహాయక సంఘాల మహిళలకు రుణాలు అందివ్వాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి జి.రామారావు, ఐసీడీఎస్ పీడీ అనంతలక్ష్మి, డీఆర్‌డీఏ పీడీ శచీదేవి, డీఎంహెచ్‌వో రవికుమార్, జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ నాగరాజారావు, మెప్మా పీడీ సరోజిని, ఎస్సీ, బీసీ కార్పొరేషన్ ఈడీలు పెంటోజీరావు, కె.పద్మ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుంచే కొత్త ఆలోచనలు అవసరం

అనకాపల్లి టౌన్: కేంద్ర మానవ వనరుల శాఖ సహకారంతో ఇన్‌స్టిట్యూషన్స్ ఇన్నోవేషన్ కౌన్సిల్ ఆధ్వర్యంలో ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్, ఇన్నోవేషన్‌పై దాడి వీరునాయుడు కళాశాలలో బుధవారం ఒక్క రోజు వర్క్‌షాప్ నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా విశాఖకు చెందిన ఎంఎస్‌ఎంఈ టెక్నాలజీ సెంటర్ ప్రిన్సిపాల్ కె.మురళీకృష్ణ, ఐఈఎస్ అడ్మిన్ ఎం.కాలేబు మాట్లాడుతూ వ్యాపారాల ప్రారంభం కోసం విద్యార్థి దశ నుంచే కొత్త ఆలోచనలు అవసరమన్నారు. కేంద్రం సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు ఎన్నో ప్రోత్సాహకాలు అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కోరిబిల్లి రమేష్, వైస్ ప్రిన్సిపాల్ ఎస్.దయా మాధురి, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ నాగేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

బెల్లం ధరలు

అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు బుధవారం 5,789 దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	3,650	4,610
మొదటి రకం	3,610	4,130
రెండో రకం	3,190	3,720
మూడోరకం	2,850	3,170

అనకాపల్లి సినిమాలు

రిటర్న్ ఆఫ్ ది డ్రాగన్ : రాజా
జాబిలమ్మ నీకు అంత కోపమా : సత్యనారాయణ స్క్రీన్-1(ఉదయం,మ్యాట్నీ)
పుష్ప-2 : సత్యనారాయణ స్క్రీన్-1 (1,2 షోలు)
అగాథియా : సత్యనారాయణ స్క్రీన్-2
మజాకా : పర్తిసాయి
సంక్రాంతికి వస్తున్నాం : షిర్డీసాయి
గార్డ్ : వెంకటేశ్వర(ఉదయం)
తండేల్ : శ్రీసత్య
శుభం : రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 26 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-5 యూనిట్లు, బీ పాజిటివ్-4 యూనిట్లు, ఓ పాజిటివ్-17 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ య.లోకేష్‌ను 97036 19706 ఫోన్ నంబరులో సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా బుధవారం 381 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 316 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధిని 08924-223595 ఫోన్ నంబరులో సంప్రదించవచ్చు.

వలస కార్మికులు... రైతన్నలకు నేస్తాలు

- మధ్యప్రదేశ్ నుంచి కుటుంబాలతో రాక
- ఊరూరా తిరిగి వ్యవసాయ పరికరాల తయారీ
- కత్తులు, గునపాలు, గొడ్డళ్లు, పారలు, కొడవళ్ల తయారీతో ఉపాధి



వలస కూలీలు తయారు చేసిన రైతు వ్యవసాయ పరికరాలు



తుమ్మపాలలో వ్యవసాయ పరికరాలు తయారు చేస్తున్న మధ్యప్రదేశ్ కూలీలు

అనకాపల్లి: రెక్కాడితే గాని డొక్కాడని జీవితాలు.. మధ్యప్రదేశ్‌కు చెందిన వలస కూలీలు. ప్రతి ఏడాది డిసెంబర్, జనవరి, ఫిబ్రవరి మాసాల్లో మధ్యప్రదేశ్ నుంచి అనకాపల్లికి కుటుంబ సమేతంగా వలస వచ్చి ఇక్కడ పలు గ్రామాల్లో రైతులకు ఉపయోగపడే కత్తులు, గునపాలు, గొడ్డళ్లు, కొడవళ్లు తయారు చేసి ఇస్తారు. గ్రామాల్లో ఒక చెట్టు వద్ద రెండు కుటుంబాలు నాలుగు మాసాల పాటు జీవిస్తూ రెక్కలు ముక్కలయ్యేలా కష్టపడి వ్యవసాయ పనిముట్లు తయారు చేస్తారు. రైతు నేస్తాలుగా ప్రజలు మన్ననలు పొందుతున్న ఈ వలస కార్మికులు తమ గ్రామానికి వచ్చినపుడు కొత్త చుట్టాలు వచ్చినట్టుగా గ్రామస్తులు ఆదరణ చూపుతారు. మండల పరిధిలో సుమారుగా 25 కుటుంబాలు మధ్యప్రదేశ్ రాష్ట్రంలో వివిధ ప్రాంతాలకు చెందిన కుమ్మరి పనులు చేసుకునే సాధారణ కూలీలు వలస వస్తారు. ఇక్కడ గ్రామంలో తెల్లవారకముందే పంచాయతీ కార్యాలయం లేదా ప్రధాన రహదారిలో ఏడాదికి రైతులకు ఉపయోగపడే పనిముట్లు తయారు చేసేందుకు సిద్ధంగా ఉంటారు. కాయకష్టాన్ని మాత్రమే నమ్ముకుని రైతులు, స్థానిక ప్రజల మన్ననలను పొందుతున్నారు. పొయ్యి వెలిగించుకునే యంత్రం, పెద్ద సమ్మెటలు రెండు, కొద్దిగా వంట సామాగ్రి మాత్రమే వారికి ఆధారం. రైతుల వద్ద ఉన్న కొద్దిపాటి ఇనుప ముక్కలు ఇచ్చి రైతులకు కావలసిన పరికరాలను తయారు చేయించుకుని వెళ్లిపోతారు.

గ్రామస్తులతో నమ్మకంగా...

ప్రతి ఏడాది గ్రామానికి వలస పక్షులుగా మధ్యప్రదేశ్ నుంచి ఇక్కడకు వచ్చి గ్రామస్తులతో కలిసి మెలిసి విశ్వాసంగా మెలగుతారు. కాయకష్టం చేసుకుంటూ రెండు మాసాలు ఆనందంగా గడుపుతారు. ఎటువంటి సమస్య వచ్చినా గ్రామంలో అక్కడ ఉన్న పెద్దలకు చెప్పి వారి సమస్యను పరిష్కరించుకుంటారు. ఒక ఊరిలో పని చేసిన కూలీలు మరో ఊరిలో పనిచేసేందుకు ఇష్టపడరు. జనవరి మాసం పూర్తి అయిన వెంటనే కుటుంబ సమేతంగా తిరిగి సొంతూళ్లకు వెళ్లిపోతారు.

తల్లిదండ్రుల నుంచి ఇదే వృత్తి



తల్లిదండ్రుల నుంచి వచ్చిన వృత్తిని చేస్తున్నారు. ఎనిమిదేళ్లుగా అనకాపల్లి మండలం ఎన్టీఆర్ కాలనీలో ప్రతి ఏడాది వచ్చి రైతులకు కావలసిన పనిముట్లు తయారు చేస్తాం..పట్టణంలో ఇనుప దుకాణాలు వద్ద కత్తెలు, పారలు, గొడ్డళ్లు, గునపాలు తయారు చేసేందుకు అవసరమైన సామగ్రి తీసుకొస్తాం. రైతులు ఇచ్చిన ఇనుప సామాను తీసుకుని వారికి కావాలసిన ఆకృతిలో పనిముట్లు తయారు చేసి అందజేస్తున్నాం. కొడవలి నుంచి పెద్ద కత్తెలు వరకూ తయారు చేసి కూలి కింద రూ.50 నుంచి రూ.300 వరకూ తీసుకుంటాం. కొడవలి తయారీకి గంట సమయం పడుతుంది. రోజుకు కుటుంబం అంతా కలిసి రూ.2వేలు వరకూ సంపాదిస్తాం.

–తిలక్, కూలి, మధ్యప్రదేశ్

భర్తకు చేదోడుగా...



భర్తకు సహాయంగా వచ్చి పనిచేస్తాం..గ్రామంలో రైతులు తెల్లవారకముందే పొలాల్లోకి రైతులకు కావలసిన కూలి పనిముట్లు తయారు చేసేందుకు సిద్ధంగా ఉంటాం. మాలో ఆడ, మగ అనే లేడా లేకుండా కష్టపడి పనిచేస్తాం. ఈ ఏడాది ఆరు కుటుంబాలు వచ్చాయి. ప్రతి ఏడాది ఎక్కడ పని చేస్తామో రానున్న ఏడాది అక్కడే పనిచేస్తాం. కొత్త ప్రదేశానికి వెళ్లం. రెండు మాసాలు పనులు బాగా ఉంటే అన్ని ఖర్చులు పోయి ఇంటికి రూ.40 నుంచి రూ.45వేలు తీసుకుని వెళ్లడం జరుగుతుంది. గ్రామంలో నమ్మకంతో పనిచేస్తాం. ఇక్కడ ఉన్నన్నాళ్లు గ్రామంలో ప్రజలు మాకు తిండికి లోటులేకుండా చూసుకుంటారు.

–ఫిరోజ్‌బీ, మహిళా కూలి

కొత్తపల్లిలో రీసెర్చ్ బృందం పర్యటన



కొత్తపల్లిలో ప్రజలతో సమావేశమై వివరాలు సేకరిస్తున్న రీసెర్చ్ ఆర్గనైజేషన్ బృందం సభ్యులు

కశింకోట: మండలంలోని కొత్తపల్లి గ్రామంలో సంబోధి రీసెర్చ్ ఆర్గనైజేషన్ బృందం బుధవారం సందర్శించి నీతి ఆయోగ్‌కు సంబంధించిన పలు అంశాలపై వివరాలు సేకరించింది. ఆర్గనైజేషన్ ఫీల్డ్ మేనేజర్ వికాస్ మల్కర్, రీసెర్చ్ ఇన్వెస్టిగేటర్ జి.సంధ్యారాణి, సూపర్‌వైజర్ వి.సంధ్యారాణి, ప్రతినిధులు వి.లక్ష్మికుమారి, పి.భానుచంద్ర, జి.లోకేష్‌లతో కూడిన బృందం సభ్యులు గ్రామంలో లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లారు. అనంతరం గ్రామస్తులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి ఆవాస్ యోజన, వృద్ధాప్య, వితంతు, వికలాంగుల పింఛన్ల పథకం, స్వయం సహాయక బృందాలు(డ్వాక్రా గ్రూపులు) పని తీరుపై ఆరా తీశారు. నేషనల్ రూరల్ లైవ్లీ హుడ్ మిషన్ గురించి వివరాలను కూడా అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వి.వి.రవికుమార్, ఈవోపీఆర్డీ ఎం.వెంకటలక్ష్మి, డీటీఎం బి.చిన్నారావు, వెలుగు ఏరియా కో-ఆర్డినేటర్ ధర్మారావు, ఐకేపీ ఏపీఎం ఎస్.పార్వతిబాయి, ఏపీవో ఎం.శ్రీనివాసరావు, హౌసింగ్ ఏఈ వి.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చిత్ర లేఖన పోటీలు



మాట్లాడుతున్న సీఐ అల్లు స్వామినాయుడు

కశింకోట: మహిళా సాధికారత కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సీఐ అల్లు స్వామినాయుడు కోరారు. కన్నూరుపాలెంలోని విజ్ఞాన్ విహార్ స్కూల్‌లో బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని పోలీస్ శాఖ ఆధ్వర్యంలో చిత్ర లేఖనం పోటీలు నిర్వహించారు. విద్యార్థులు ఈ పోటీలకు ఉత్సాహంగా హాజరై తమ ప్రతిభకు పదునుపెట్టారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ సమాజంలో లింగ సమానత్వం కోసం కృషి చేయాలన్నారు. పోటీలో ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందించారు. పోలీసులు, ఉపాధ్యాయ సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

26 మద్యం బాటిళ్ల స్వాధీనం



నిందుతుడితో ఎక్సైజ్ పోలీసులు

అనకాపల్లి టౌన్: అక్రమంగా మద్యం విక్రయాలు చేస్తున్న వ్యక్తిపై దాడి చేసి, 26 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ పోలీసులు తెలిపారు. స్థానిక ఎన్టీఆర్ మార్కెట్ యార్డ్ దగ్గర బుధవారం వి.లీలా మోహన్ గోవింద్(36) అక్రమంగా మద్యం విక్రయిస్తున్నాడని వచ్చిన సమాచారం మేరకు దాడి చేశామన్నారు. నిందితుడిని అరెస్ట్ చేసి, కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

వ్యక్తి అదృశ్యం

అనకాపల్లి: స్థానిక లక్ష్మీదేవిపేటకు చెందిన షేక్‌బాబా గతనెల 23వ తేదీ నుంచి కనిపించడం లేదని ఆయన భార్య దుర్గాభవాని బుధవారం పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ డి.ఈశ్వరరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గత నెల 23న షేక్‌బాబా ఇంటి నుంచి దుకాణానికి వెళ్లి వస్తానని చెప్పి తిరిగి రాలేదు. ఆయన భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చెప్పారు.

ఘనంగా అభయాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం



పూజలందుకున్న అభయాంజనేయస్వామి



మహిళల కోలాటం ప్రదర్శన

కశింకోట: ఉగ్గినపాలెంలో అభయాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా స్వామికి తమలపాకులతో అర్చన నిర్వహించారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. తాళ్లపాలెంకు చెందిన బృందంతో భజనలు, సాయిబాబా ప్రవచనాలు నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు కలగా గోవింద ఆధ్వర్యంలో మధ్యాహ్నం భారీ అన్నసమారాధన చేపట్టారు. సాయంత్రం నూతలగుంటపాలెం, విశాఖలకు చెందిన బృందాల కోలాటాల ప్రదర్శన ఆకట్టుకుంది.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం



విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన

అనకాపల్లి టౌన్: స్థానిక గుడ్ షెపర్డ్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ వార్షికోత్సవం బుధవారం రాత్రి ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా డైట్ కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలంటే విద్యతో పాటు క్రమశిక్షణ ముఖ్యమన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ ఎ.పాల్, స్వర్ణ కుమార్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఐదో రోజుకు ఆర్టీసీ ఉద్యోగుల దీక్షలు



డిపో ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు

అనకాపల్లి టౌన్: స్థానిక డిపోలో పని చేస్తున్న డ్రైవర్, కండక్టర్ అక్రమ సస్పెన్షన్‌ను ఎత్తి వేయాలని ఆర్టీసీ ఉద్యోగులు చేస్తున్న రిలే నిరాహార దీక్షలు బుధవారానికి ఐదో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఏపీపీటీడీ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి మాట్లాడుతూ డిపో మేనేజర్ రెచ్చగొట్టే ధోరణిలో ఉద్యోగుల పట్ల వ్యవహరించడం సరికాదన్నారు. తక్షణమే సస్పెన్షన్‌లను రద్దు చేయకపోతే ఉద్యమాన్ని తీవ్రం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జి.ఎల్.కృష్ణ, వై.జి.రాజులు, ఎం.వై.బాసు, కె.ప్రసాద్, కె.ఎస్.వి.రమేష్, తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల నిరసన



ఎంఈవో కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

కశింకోట: ప్రభుత్వం తమ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు బుధవారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో స్థానిక ఎంఈవో కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఏపీ సమగ్ర శిక్షా కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ మండల శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఉద్యోగులు మాట్లాడుతూ హెచ్ఆర్ పాలసీ అమలు చేయడానికి కమిటీని ఏర్పాటు చేయాలన్నారు. కనీస వేతనాలు అమలు చేయాలని కోరారు. గతంలో సమ్మె కాలపు ఒప్పందాలను అమలు చేయాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

23న ఆలయాల్లో పక్షులకు తిండిగింజలు

అనకాపల్లి: గ్రీన్ క్లబ్ ఆధ్వర్యంలో ఈ నెల 23న పట్టణంలో అన్ని ఆలయాల్లో ఉదయం 8 గంటలకు పక్షులకు వేసవి కాలంలో తిండిగింజలు(వరి కుంచులు), తాగునీరు ఉంచు మట్టి పాత్రలు, పక్షుల గూళ్లు ఏర్పాటు చేయనున్నట్టు గ్రీన్ క్లబ్ వ్యవస్థాపకుడు కొణతాల ఫణిభూషన్ శ్రీధర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేసవి దృష్టిలో పెట్టుకుని పక్షులకు ఇంటి బయట కొద్దిగా నీరు, తిండి గింజలు గృహ యజమానులు ఏర్పాటు చేయాలన్నారు. పక్షుల జాతిని కాపాడుకోవలసిన బాధ్యత మన అందరిపై ఉందన్నారు.

నూకాంబిక ఉత్సవాల్లో బాలలకు ప్రత్యేక వసతులు



నూకాంబిక అమ్మవారి ఆలయ ఉద్యోగులతో మాట్లాడుతున్న గొండు సీతారాం

అనకాపల్లి: ఈ ఏడాది ఉగాది నుంచి నెల రోజుల పాటు జరిగే నూకాంబిక ఉత్సవాల్లో బాలలకు ప్రత్యేక వసతులు కల్పించాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం సూచించారు. స్థానిక గవరపాలెం అమ్మవారి ఆలయంలో బుధవారం ఉద్యోగులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అమ్మవారి జాతరలో బాలల హక్కులకు ప్రాధాన్యత కల్పించాలని, వారికి కావలసిన సౌకర్యాలు దేవస్థానం అధికారులు చేపట్టాలని సూచించారు. క్యూలైన్లలో తల్లిపాలు పట్టే కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. చిన్నారులకు, దివ్యాంగ బాలలకు ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేయాలని, అమ్మవారి వారపు దినాల్లో ప్రత్యేక మెడికల్ క్యాంపులు, పిల్లల వైద్య నిపుణులను అందుబాటులో ఉంచాలన్నారు. నూకాంబికా ఆలయం కార్యనిర్వహణాధికారి ఎన్.సుజాత మాట్లాడుతూ బాలలకు ప్రతి ఏడాది ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారి కె.అనంతలక్ష్మి, చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ అధికారి పి.ప్రభావతి, కార్మిక శాఖ అధికారులు కె.వసంతరావు, కె.బాలకృష్ణ, జిల్లా బాలల సంరక్షణ అధికారులు ఎం.రమేష్, కె.ఎల్.మనోహర్‌రావు, లీగల్ కం ప్రొబేషన్ అధికారి బి.రమాదేవి, సామాజిక కార్యకర్తలు కె.రమ్య, డి.లోవరాజు, ఆలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి



మాట్లాడుతున్న బీసీ సంఘం నాయకులు

అనకాపల్లి: సార్వత్రిక ఎన్నికల సమయంలో బీసీలకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తామని కూటమి నాయకులు ఇచ్చిన హామీలను తక్షణం అమలు చేయాలని సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు జొన్నకోట చెన్నమూర్తి డిమాండ్ చేశారు. స్థానిక రింగ్ రోడ్డు సంఘం కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీలకు సబ్సిడీపై రుణాలు మంజూరు చేస్తామని, బీసీలకు రిజర్వేషన్ సౌకర్యం కల్పిస్తామని, 50 సంవత్సరాలు పైబడిన బీసీలకు ప్రభుత్వ పింఛన్లు అందజేస్తామని ఇచ్చిన హామీలను నేటి అమలు చేయకపోవడం అన్యాయమమన్నారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఉల్లిపాయల శంకరయ్య ఆదేశాల మేరకు గ్రామ స్థాయి నుంచి ర్యాలీలు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం పట్టణ యువజన విభాగం ఉపాధ్యక్షులు చిందాన కృష్ణ, ఉమా శంకర్ ప్రసాద్, కార్యదర్శి పాలతీర్థపు రాజు, సహాయ కార్యదర్శి ద్వారపూడి కృష్ణ, మండల అధ్యక్షుడు ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీకి కార్యకర్తలే బలం



జన్మదిన వేడుకలలో పాల్గొన్న కిషోర్, శ్రీను

అనకాపల్లి టౌన్: వైఎస్సార్‌సీపీకి కార్యకర్తలే బలమని ఆ పార్టీ అనకాపల్లి నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ సోదరుడు కుమార్ రాజా అన్నారు. స్థానిక రింగ్‌రోడ్‌లోని పార్టీ కార్యలయంలో పార్టీ కశింకోట మండల అధ్యక్షుడు మలసాల కిషోర్, కశింకోట వైస్ ఎంపీపీ పెంటకోట శ్రీను జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. కేక్ కట్ చేసి, అందరికీ పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో కశింకోట ఎంపీపీ కలగా గున్నయ్య నాయుడు, పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, 84వ వార్డు ఇంచార్జ్ జాజుల రమేష్, 80వ వార్డు ఇంచార్జ్ కె.ఎం.నాయుడు, పార్టీ నాయకులు బొడ్డేడ శివ, పార్టీ మండల అధ్యక్షుడు పెద్దిశెట్టి గోవింద్, తదితరులు పాల్గొన్నారు.

శత శాతం టీకాల ప్రక్రియ పూర్తి చేయాలి



తాళ్లపాలెం పీహెచ్‌సీ రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా ఇమ్యునైజేషన్ వైద్యాధికారి చంద్రశేఖర్‌దేవ్

కశింకోట: జాతీయ ఆరోగ్య కార్యక్రమాల లక్ష్యాలను శత శాతం పూర్తి చేయాలని జిల్లా ఇమ్యునైజేషన్ వైద్యాధికారి కె.చంద్రశేఖర్‌దేవ్ ఆదేశించారు. మండలంలోని తాళ్లపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. వ్యాక్సిన్ల కోల్డ్ చైన్ (శీతలీకరణ) నిర్వహణను, మందుల స్టోర్, రికార్డులను తనిఖీ చేసి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. క్షేత్ర స్థాయిలో అన్ని వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాలను శత శాతం పూర్తి చేయాలన్నారు. తాళ్లపాలెం సచివాలయం-1 పరిధిలో వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని పరిశీలించారు. టీకాల కార్యక్రమాన్ని అప్రమత్తతతో నిర్వహించాలని ఆరోగ్య కార్యకర్తలు, ఆశ కార్యకర్తలకు సూచించారు. జిల్లా గణాంకాధికారి ఎ.రామచంద్రరావు, జిల్లా కోల్డ్ చైన్ మేనేజర్ అరుణాచలం, తాళ్లపాలెం పీహెచ్‌సీ ప్రధాన వైద్యాధికారి ఎ.మనీషా, ఆరోగ్య బోధకుడు ఎం.ఎస్.వి.ప్రసాద్, ఆరోగ్య విస్తరణాధికారి వి.ఎ.సుబ్బారావు, సిబ్బంది పాల్గొన్నారు.

గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్



కశింకోట బస్ స్టేషన్‌లో గంజాయితో పట్టుబడిన నిందితుడు

కశింకోట: కశింకోటలోని బస్ స్టేషన్ వద్ద గంజాయి తరలిస్తున్న వ్యక్తిని బుధవారం సాయంత్రం అరెస్టు చేసినట్లు సీఐ అల్లు స్వామినాయుడు తెలిపారు. ఆరు కిలోల గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. తమిళనాడు రాష్ట్రంలోని దిండిగల్ జిల్లాకు చెందిన యువరాజా చిన్నస్వామి గంజాయితో పరారు కావడానికి సిద్ధంగా ఉండగా.. అప్రమత్తంగా వ్యవహరించి తమ సిబ్బందితో వెళ్లి పట్టుకున్నామన్నారు. ఈ సందర్భంగా రెండేసి కిలోల బరువు కలిగిన మూడు గంజాయి ప్యాకెట్లు స్వాధీనం చేసుకొని నిందితుడ్ని అరెస్టు చేశామన్నారు. పాడేరు నుంచి కొనుగోలు చేసి గంజాయి తెచ్చినట్లు తెలిపారు. కేసు దర్యాప్తులో ఉందన్నారు.